గడువులోగా రీసర్వే పూర్తి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఇన్‌చార్జి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్ సోమవారం స్థానిక తాహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రీ సర్వే ఆన్‌లైన్ పోర్టల్‌ను పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీ సర్వే పక్కాగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. నిర్దిష్టమైన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ ముజీబ్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జెసి అభిషేక్ గౌడ

సమస్యలపై అంగన్వాడీల ధర్నాలు

- కనీస వేతనం, ఇతర డిమాండ్లు నెరవేర్చాలని వినతి
- సమ్మె ఒప్పందాల అమలులో నిర్లక్ష్యంపై నిరసన

గతేడాది సమ్మె కాలంలో మినిట్స్ రూపంలో ప్రభుత్వం అంగీకరించిన హామీలను అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు.

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడీ వర్కర్లు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.వెంకటలక్ష్మి, సిహెచ్.కుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు మాట్లాడుతూ గతేడాది అంగన్వాడీలు 42 రోజుల సమ్మె సందర్భంగా 11 డిమాండ్స్ అంగీకరిస్తూ ఇచ్చిన జివోను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ సదుపాయం కల్పించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్ గ్రేడ్ చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సూపర్వైజర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు మంగ, రత్నం, సత్యవతి, లక్ష్మీ, సుందరమ్మ, రమణి, మేరీ, పెద్ద సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి అంగన్వాడీ ప్రాజెక్టు వద్ద మండలంలోని అంగన్వాడీ వర్కర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సూపర్వైజర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని అంగన్వాడీ యుడిసికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు డి.ప్రసూన, ఎన్.బేబీదేవి, నాయకులు రామలక్ష్మి, ఎం.మల్లమ్మ, ఎం.సీతమ్మ, కె.నాగమణి పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గంగవరం : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి దహన సంస్కా రాల ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. యూని యన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కె.రాణి, అధ్యక్షులు కే నాగదేవి, జి వెంకయ్యమ్మ, శిరీష, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : చింతూరు మండలం చట్టి ఐసిడిఎస్ కార్యాలయం ముందు సిఐటియూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ చింతూరు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్‌కు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి నూక రత్నం, వర్కర్లు వసంత, పార్వతి, సుక్కమ్మ, లలిత పాల్గొన్నారు


అరకులోయలో సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

అరకులోయ రూరల్: అంగన్వాడీలకు కనీస వేతనాలు రూ.26వేలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు,మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని కోరుతూ సోమవారం అరకులోయ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు అంగన్వాడీలు ధర్నా చేశారు. అనంతరం సిడిపిఒకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ. రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం సరికాదన్నారు. 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ,సమస్యల పరిష్కారానికి చేసిన 42 రోజుల చారిత్రాత్మక సమ్మెతో ప్రభుత్వం దిగొచ్చి, 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మాటిచ్చినా నేటికీ నెరవేర్చలేదన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు డి నాగమ్మ,పి వెంకట్ లక్ష్మి,నిర్మల,భారతి, భవాని, లలిత, లక్ష్మీ పాల్గొన్నారు.


రాజవొమ్మంగిలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


గంగవరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


మారేడుమిల్లిలో అంగన్వాడీల ధర్నా


చింతూరులో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా
విజయగౌరిని గెలిపించాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి-పెదబయలు : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు.విజయగౌరికి మొదటి ప్రాధాన్య ఓటు 1వేయాలని కోరారు. సోమవారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు బొండ సన్నిబాబు జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, జుంబు దేవరాజు తదితరులతో మండల కేంద్రంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశంలో కిల్లో సురేంద్ర మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గత 19ఏళ్లుగా నిజాయితీగా నిబద్ధతతో విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు నిర్వహించే అన్ని పోరాటాలకు సంఘీభావాన్ని ప్రకటించడంతోపాటు ప్రత్యక్షంగా పాల్గొన్న ఘన చరిత్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ఉందన్నారు. కఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 200 సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని ఈనెల 27న జరగనున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.


ప్రచారం నిర్వహిస్తున్న సురేంద్ర, తదితరులు

ప్రజావాణిని వినిపించే సత్తా పిడిఎఫ్‌కే ఉంది

విజయ గౌరిని గెలిపిస్తేనే న్యాయం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- అరకులోయ : ప్రజా ఉద్యమాల్లో నిరంతరం వెన్నంటే ఉండే వారినే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారానికి అరకులోయ వచ్చిన సందర్భంగా స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల హక్కుల కోసం సుదీర్ఘ పోరాటం చేసిన అనుభవం, సత్తా విజయ గౌరికి ఉందన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిం చాలని కోరారు. పాలకవర్గాలు, ప్రతిపక్ష పార్టీల మద్దతుతో పోటీలో ఉన్న సభ్యులను ఎన్నుకుంటే ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల ప్రయోజనాలు గాలికొదిలేసి, ఆయా పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. సమస్యలపై పోరాడి పరిష్కరించే సత్తా, పోరాటాలతో అనుకున్నవి సాధించు కోవాలన్న చిత్తశుద్ధి పిడిఎఫ్ అభ్యర్థులకు ఉంటుందని, ప్రజాప్రయోజ నాల కోసం పనిచేసే పిడిఎఫ్ బలపరు స్తున్న కోరెడ్ల విజయగౌరిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.లగిసాపల్లి, కెజిబివి ఆశ్రమ ఉన్నత పాఠశాల, కృష్ణాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాడేరు జూనియర్ కళాశాలచ పాడేరు ఆశ్రమ ఉన్నత పాఠశాల తలారి సింగ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హుకుంపేట అరకు వ్యాలీ మండలంలోని ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ,హై స్కూళ్లను సందర్శించి అక్కడి ఉపాధ్యాయ ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమే ప్రజా గొంతును వినిపిస్తారని, గిరిజన ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్ అమలు, జిఒ 3 ప్రయోజనాల పునరుద్ధరణ, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన, గురుకుల పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్పు, రెండు పిఆర్‌సిలను కలిసి వేతనాలు చెల్లింపు, సమ్మె కాలపు జీతాలు, జిఒ 117రద్దు, తదితర సమస్యలపై పోరాటానికి విజయగౌరి గెలుపు అవసరం ఉందన్నారు.13 మంది ఎమ్మెల్సీలు 26 సార్లు గెలిచిన ఘనత పిడిఎఫ్ ఉందన్నారు ప్రజాతంత్ర ఉద్యమంలో దశాబ్దాలుగా పోరాడుతున్న కోరెడ్ల విజయగౌరి గెలిస్తే, శాసనమండలిలో ప్రజావాణి వినిపించడం తోపాటు పోరాటాల ద్వారా ప్రభుత్వాలపై ప్రజాసమస్యలపై ఒత్తిడి తెచ్చి పరిష్కరి స్తారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, పక్కనే బాలదేవ్


రేఖపల్లి-చింతూరు రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

జోరుగా రోడ్డు మరమ్మతులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి నుండి చింతూరు వరకు రహదారి మరమ్మతులు జోరుగా సాగుతున్నాయి. రేఖపల్లి-చింతూరు బీటీ రోడ్డు గతుకులమయమైంది. పెద్ద పెద్ద గోతులతో రోడ్డు దర్శనం ఇవ్వడంపై ప్రజాశక్తి దినపత్రిక వార్తా కథనాన్ని ప్రచురించి వెలుగులోకి తీసుకొచ్చింది. దీనికి స్పందించిన అధికార యంత్రాంగం తక్షణమే యుద్ధపాదిపదికన రోడ్డు గుంతలు పూడ్చి, అక్కడక్కడ మరమ్మతులు చేయడం జరిగింది. కొత్త రోడ్డు వేయక పోయినా కనీసం గుంతలను పూడ్చడం వల్ల ప్రజల ఇబ్బందులు కొద్ది మేరకు తగ్గే అవకాశం ఉండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండలో ఆర్థిక అక్షరాస్యత, లావాదేవీలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ సేవలపై కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మిత్ర జ్వరంగి దేవేంద్ర మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ వారి ఆదేశాల మేరకు వినియోగదారులు ఖాతాలు తెరవడం, డబ్బులు పొదుపు చేసుకోవడంపై ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రుణాలు తీసుకోవడం వంటి లావాదేవీలు ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే చేసుకోవాలని సూచించారు. దీనివలన తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు. నగలుకు రక్షణ ప్రభుత్వ బ్యాంకుల్లో మాత్రమే ఉంటుందన్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరు తక్కువ పెట్టుబడితో ప్రభుత్వ బ్యాంకుల్లో జీవిత బీమా చేసుకోవాలని కోరారు. బ్యాంకు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ లింకులు ఎవరు నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో దారకొండ ప్రాంత ప్రజలు, డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యులు, విఓఏ సోమరాజు, భూషణం తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

1/70 చట్టం పటిష్ట అమలుకు తీర్మానం

- అనంతగిరి మండల సర్వసభ్య సమావేశం
- చట్టసవరణ ఆలోచనపై ఎంపీ తనూజారాణి ఆగ్రహం
- మైదాన ప్రాంతాలకు ఇసుక తరలిస్తే కఠిన చర్యలు : జెడ్‌పిటిసి
- వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలకు ఆదేశం




మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి, చిత్రంలో ఎంపిపి నీలవేణి, జెడ్‌పిటిసి గంగరాజు తదితరులు

ప్రజాశక్తి-అనంతగిరి రూరల్

గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం పటిష్ట అమలుకు చర్యలు చేపట్టాలని అనంతగిరి మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. సోమవారం స్థానిక ఎంపిపి శెట్టి నీలవేణి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అరకు ఎంపీ గుమ్మ తనుజారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గిరిజనుల గుండెకాయ లాంటి భూబదలాయింపు నిషేధ 1/70 చట్టంలో సవరణలు చేయాలన్నా ఆలోచనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే జిఒ 3 రద్దుతో అనేక హక్కులు, అధికారాలకు దూరమైన గిరిజనులకు, 1/70 చట్టం కూడా లేకుండా చేయాలన్న కుట్రలు దుర్మార్గమన్నారు. జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఆ ఊసెత్తడం లేదన్నారు 1/ 70 చట్ట సవరణ ఆలోచన విరమించుకోకుంటే, పార్లమెంట్ స్థాయిలో ఉద్యమిస్తామన్నారు.

అధికారుల గైర్హాజరుపై జెడ్‌పిటిసి ఆగ్రహం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి కేవలం నాలుగు శాఖలు మినహాయించి, మిగిలిన శాఖల మండలాధికారులు గైర్హాజరుపై సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు అగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు సమయపాలన పాటించడం లేదని, విధులకు డుమ్మా కొడుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు అధికారులు బాధ్యత యుతంగా పనిచేయకపోతే మండల అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో కాశీపట్నం గోస్తనీ గెడ్డ, ఎర్రిగడ్డ, వెంకయ్య పాలెం చిలకల గెడ్డ, గుమ్మ కోట ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిపోతోందని, దాన్ని అరికట్టాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. తహశీల్దార్ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరుగుతోందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తక్షణం తగు చర్యలు చేపట్టాలని సూచించారు. రైల్వే శాఖ, ప్రభుత్వ కాంట్రాక్టు పనులకు ఇసుక అక్రమంగా తరలిస్తే తహశీల్దార్‌పై చర్యలు తీసుకోక తప్పదని ఎంపీ హెచ్చరించారు. గిరిజనుల ఇల్లు నిర్మాణానికి మాత్రమే ఉచితంగా ఇసుకను ఇవ్వాలని, కాంట్రాక్టు పనులకు తగిన ధరకు ఇసుక సరఫరా చేసేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత తహశీల్దార్‌పై ఉందన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి జాడలేకపోవడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం సర్పంచ్ కిలో మొస్య, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు


సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపిటిసిలు, సర్పంచ్‌లు

పబ్లిక్ పరీక్షలపై టెన్త్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని విఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి, జీవిత లక్ష్యాలు ఎలా సాధించాలి అనే అంశాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ, సంతోష్ కుమార్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులకు పునాది అని, ఈ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. అందవల్ల విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడు ఆలోచనలను దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిచ్చడి బాబూరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్ కుమార్


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ సభ్యులు

విలేకరిపై దాడిని ఖండిస్తూ నిరసనలు

- టిడిపి నేతపై కఠిన చర్యలకు జర్నలిస్టుల డిమాండ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పార్వతీపురం మన్యం జిల్లాలో మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ పాత్రికేయులపై దాడులు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పాత్రికేయులు ఎ.సూరిబాబు, యు.ఉదయభాను, పి.రామరాజు, జి.బాలరాజు, కె.శివ, ఈ.శ్రీను, కె.శ్రీను, లక్ష్మణ్, పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : పార్వతీపురం మన్యం జిల్లాలమక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టిడిపి మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడం హేయమైన చర్య అని హుకుంపేట మండల ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవ సంఘం నాయకులు అన్నారు. విలేకరి పై దాడిని ఖండిస్తూ సోమవారం నిరసన చేపట్టారు. జర్నలిస్టులపె ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చూడాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించి, మీడియాపై దాడులు అరికట్టాలని కోరారు.కార్యక్రమంలో మండల పాత్రికేయులు గణేష్, ఆనంద్, ఉదయ్ నాగరాజు,చిట్టిబాబు, కొండబాబు,అఖిల్, శ్రీనుపాల్గొన్నారు.

డుంబ్రిగుడ : పార్వతీ మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన టిడిపి మండల అధ్యక్షుడుపై చర్యలు తీసుకోవాలని ఎపియుడబ్ల్యూజే మండల అధ్యక్షులు ఎం ఈసుబాబు, ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు ఎం స్వామి డిమాండ్ చేశారు. సోమవారం విలేకరిపై దాడికి నిరసన వ్యక్తం చేశారు వాస్తవాలను బయటపెట్టిన జర్నలిస్టులపై దాడి చేయడం సరికాదని, తక్షణమే దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఎస్ కోటేశ్వరరావు, ఎస్ గోపాల్ పాల్గొన్నారు.


హుకుంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు



పీసా చట్టంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

పీసా చట్టంపై శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- చింతపల్లి: పీసా చట్టంపై అవగాహనకు కమిటీలకు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ యుఎస్ఎ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలోనూ, వెలుగు కార్యాలయంలోనూ నాలుగు రోజులుగా పీసా చట్టంపై ప్రతిరోజూ 200 మంది కమిటీ సభ్యులకు అవగాహనకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం పీసా కమిటీల శిక్షణ తరగతులను రాష్ట్ర పరిశీలకులు కె.నాగరాజు పరిశీలించారు. శిక్షణ తరగతులలో అధిక సంఖ్యలో ద్వారా మహిళలు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొనడం అభినందనీయమన్నారు. చట్టంపై అవగాహన పెంచుకుని, దాని అమలుకు కృషి చేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 21వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం శ్రీనివాసరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : పీసా కమిటీల విధివిధానాలు, సభ్యుల బాధ్యతలపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఒ లోవరాజు ఆధ్వర్యంలో బొండం పంచాయతీ క్లస్టర్ ఉపాధ్యక్ష కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎల్ లవరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల ఎన్నికైన పీసా కమిటీ వైస్ ప్రెసిడెంట్లు, కార్యదర్శులతో పాటు ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారుల ద్వారా స్వయం సంఘ గ్రూపు అధ్యక్షుల కార్యదర్శులకు ఒక్కొక్కబ్యాచ్కు 100 మంది చొప్పున రోజుకు రెండు బ్యాచ్ల మాస్టర్ ట్రైనర్ శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బొండం క్లస్టర్ పెసా కమిటీ వైస్ ప్రెసిడెంట్,న్యాయవాది సుంకరి ఆనంద్, సర్పంచ్ దూరియా భాస్కర్,బొండం పంచాయతీ, పేసా కమిటీలు బి శైలజ, కె అప్పన్న,బుజ్జిబాబు, సత్యారావు వార్డు మెంబర్లు, ద్వాక్రా సంఘ మహిళ సభ్యులు హాజరు బొండం సచివాలయాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఏకలవ్య ఉపాధ్యాయుల తీరు దుర్మార్గం'

ప్రజాశక్తి -చింతపల్లి : స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయులు తీరుబాగోలేదని, విద్యార్థులను వివక్షాపూరితంగా కొడుతున్నారని టిడిపి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు రాత్రి వేళల్లో మద్యం మత్తులో హింసిస్తున్నారని పాఠశాల సందర్శనలో పలువురు విద్యార్థులు తన దృష్టికి తెచ్చారన్నారు. గతంలో అన్నామలై అనే విశాఖ జిల్లాకు చెందిన ప్రిన్సిపాల్గా ఉన్న సమయంలో ఏకలవ్య పాఠశాలలో విద్యా బోధన ఎంతో సజావుగా సాగిందని, కానీ నేడా పరిస్థితి లేదని ఆవేదన వెలిబుచ్చారు. గోడకుర్చీ వేయించడం, చెప్పులతో కొట్టడం వంటి చర్యలతో తాము పరీక్షలు రాయలేని స్థితిలో ఉన్నామని పలువురు విద్యార్థులు కన్నీటి పర్యంతమై చెప్పారన్నారు. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు ఎటిడబ్ల్యుఒ.నాగ జయలక్ష్మి, ఏకలవ్య ఓఎస్డిలను కలిసి విన్నవించామన్నారు.

'సెయింట్ ఆన్స్'లో ర్యాగింగ్పై కలెక్టర్ ఆగ్రహం


వార్డెన్పై వేటు - హాస్టల్ నుంచి ముగ్గురు బోర్డర్ల తొలగింపు

ప్రజాశక్తి -పాడేరు : తమపై ఫిర్యాదు చేశారన్న అభియోగంతో స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఏడవ తరగతి విద్యార్థినిపై ముగ్గురు పదవ తరగతి విద్యార్థినులు కొట్టినట్లు వివిధ మాధ్యమాలలో ప్రసారమైన వార్తలపై జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్కుమార్ స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిఇఒ పి బ్రహ్మాజీరావును ఆదేశించారు. డిఇఒ ఆదేశాలతో ఎంఇఒ విశ్వప్రసాద్ విచారణ జరిపి అందించిన నివేదిక ఆధారంగా వసతి గృహం నిర్వాహకురాలు శ్రావ్యను విధుల నుంచి తొలగించారు. అదేవిధంగా ముగ్గురు బోర్డర్లను హాస్టల్ నుంచి తొలగించి ఇళ్లకు పంపించివేశారు.

ప్రాథమిక పాఠశాలలను కుదిస్తే ఊరుకోబోం

117 జిఒ రద్దు చేయాలి : ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి- పెదబయలు :క్లస్టర్, మోడల్ స్కూళ్ల పేరుతో ప్రాథమిక పాఠశాలలను కుదిస్తే చూస్తూ ఊరుకోబోమని ఆదివాసీ గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు హెచ్చరించారు. జిఒ 117ను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం, పీసాకమిటీ, గ్రామపంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, ఎంపిడిఒ ఎల్ పూర్ణయ్యకు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా సన్నిబాబు మాట్లాడుతూ .జిఒ 117తో అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలోని 377 ప్రాథమిక పాఠశాలలను మూతవేతకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్త చేశారు. అందులో పెదబయలు మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 32 ప్రాథమిక పాఠశాలలను మూసివేతకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆదేశాలతో పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. జిఒ117తో ప్రాథమిక పాఠశాలలను కుదించి మూసేసి, క్లస్టర్ మోడల్ స్కూల్ పేర్లతో గిరిజన విద్యార్థులను చదువుకు దూరం చేయాలని చూడడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు ఇందులో భాగంగానే రోగులపేట, దగ్గుపాడు, పెద వంచరంగి, కొత్తపుట్టు, ఉగ్రగరువు, కుమ్మరిపుట్టు, గజ్జడి, గోచారి, సాలెవులు, బొర్లాడ, గంపరాయి బుడ్డపుట్టు, మొట్టల గుమ్మి, లక్కేపుట్టు, జమదాల, లోగాసారిపుట్టు, మూలగరువు, వనబంగి, కొంద్రు, బొడ్డగుంది, గోమంగి, సంపంగిపుట్టు,రాసగుప్త, కోడపుట్టు, జర్సింగి, భాషల, పనసపుట్టు, బంగారుమెట్ట, కిండలం బుడ్డపుట్టు, జె పెద్దబయలు, కీత్తుకొండ, సంపంగిపుట్టు, పెద్దకొండ గ్రామాల్లోని పాఠశాలల్లో 3,4,5, తరగతులు చదువుతున్న ఆదివాసీ విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో తరలించాలని చూస్తున్నారని, ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గిరిబాలలను ప్రాథమిక విద్యకు దూరం చేసే జిఒ 117ను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రోగులపేట పీసా కమిటీ కార్యదర్శి జంబు దేవరాజు, ఉపాధ్యక్షులు గబుడు రాధాకృష్ణ, సీతగుంట వైస్ సర్పంచ్ బొండా గంగాధరం, వినియోగదారుల సంఘం నాయకులు కూడా కృష్ణబాబు, లోహిదాసు, జంబు ప్రభాకరరావు, రామంజి గోమంగి వైస్ సర్పంచ్ కూడా మచ్చ కొండబాబు, 23 గ్రామపంచాయతీ పరిధిలోగల వార్డు మెంబర్లు వైస్ సర్పంచులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ పూర్ణయ్యకు వినతి పత్రం అందజేసిన బొండా సన్నిబాబు

పర్యాటక కార్మికుడు మృతి

యాజమాన్య నిర్లక్ష్య వైఖరిపై ఆందోళన

ప్రజాశక్తి- అరకు లోయ/ రూరల్ : అరకులోయ పర్యాటకశాఖ హరిత (మయూరి) అతిథి గృహంలో పనిచేస్తున్న పూజారి లొల్లిత్ (40) అనే గిరిజన కార్మికుడు సోమవారం చెందాడు. ఎప్పటి లాగానే ఉదయం విధులకు హాజరైన లొలిత్ అతిథి గృహం ఆవరణలో స్వచ్ఛాంధ్రలో భాగంగా శుభ్రత పనులు చేస్తూ కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు అరకులోయ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనారోగ్యంతో ఉన్న తనకు సెలవు ఇవ్వాలని కోరినా నిరాకరించడంతో అలాగే వచ్చి పనిచేయడం వల్లే హఠాన్మరణం పొందాడని ప్రజాసంఘాలు, మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై ఆందోళన

లొల్లిత్ మృతి విషయాన్ని టూరిజం యాజమాన్యానికి తెలియపరిచినా స్పందించలేదని మృతుని భార్య, బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆసుపత్రిలోనే మృతదేహంతో వేచి ఉన్నామని, టూరిజం నుంచి ఒక అధికారి వచ్చి, తమ పై అధికారులతో మాట్లాడతానని వెళ్లిపోయారన్నారు. విధి నిర్వహణలో ఉండి మృతి చెందిన కార్మికుని పట్ల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అరకులోయ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని మయూరి అతిథి గృహానికి తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. కార్మికుడు పూజారి లొలిత్ ఒంటిపై చిన్న చిన్న గాయాలు ఉన్నాయని బంధువులు తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకూ మృతదేహం తీసుకెళ్లేది లేదని వారు స్పష్టం చేశారు. సంఘటనాస్థలికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

టూరిజం కార్మికుడు లొలిత్ మృతి కి టూరిజం యాజమాన్యం బాధ్యత వహించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. లొలిత్ కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుని మృతిపై టూరిజం అధికారుల నిర్లక్ష్యవైఖరి తగదన్నారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారని ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు స్వాభి రామ్మూర్తిబాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం: సురేంద్ర

అరకులోయ : పర్యాటక శాఖ హరిత హిల్ రిసార్ట్స్లో మృతి చెందిన గిరిజన కార్మికుడు పూజారి లలిత్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. మృతి చెందిన కార్మికుడి మృతదేహంతో తమ బంధువులతో కలిసి హరిత హిల్ రిసార్ట్స్ ఆందోళనలో పాల్గొన్నారు. రెండు దశాబ్దాల పాటు టూరిజం శాఖలో విధులు నిర్వహించిన కార్మికుడు మృతి చెందితే పర్యాటకశాఖ అధికారులు పూర్తిస్థాయిలో స్పందించకపోవడం విచారకరమన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని,కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుదరని ఒప్పందం.. కొనసాగుతున్న ఆందోళన

సోమవారం రాత్రి పర్యాటక శాఖ అధికారులతో జరిగిన చర్చల్లో ఎక్స్గ్రేషియా రూ.2 లక్షలు, టూరిజం శాఖ నుంచి రూ.మూడు లక్షలు, కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని అధికారులు అంగీకరించారు. దీనికి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో ఆందోళన కొనసాగుతుంది. సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, మాడగడ సూపర్ సర్పంచ్ బాలు, టూరిజం కార్మికులు కుటుంబీకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు



హైడ్రో పవర్ అనుమతులు రద్దు చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స

ప్రజాశక్తి - చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాల అనుమతులను వెంటనే నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనరస అన్నారు. సోమవారం చింతపల్లి వచ్చిన సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్లో పాత్రికేయులతో మాట్లాడుతూ అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిట్టింపాడు, గుజ్జిలి గ్రామాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు రాష్ట్రప్రభుత్వం నవయుగ నిర్మాణ సంస్థకు అప్పగించిందన్నారు. ఈ నెల 6న క్యాబినెట్ సమావేశంలో వాటికి ఆమోదం తెలుపుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసిందన్నారు. ఆదివాసీల మనోభావాలు, పెసాచట్టం, గ్రామసభ తీర్మానం లేకుండా నిర్మాణాలు ఎలా చేపడతారని, ఆ నిర్మాణాలను వెంటనే రద్దు చేయాలన్నారు. మన్యంలో 1/70 చట్టాన్ని పరిరక్షిస్తామని గిరిజన చట్టాలను గౌరవిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని, దీంతో అఖిలపక్షం తలపెట్టిన 48 గంటల మన్యం బంద్ను విరమించుకున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రకటనలో స్పష్టత రావాలన్నారు. జిఒ 3 బిల్లు ప్రయోజనాల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని, ఈ నెల 24 నుంచి నిర్వహించే శాసనసభ సమావేశంలో దీనిపై బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఉద్యోగాల్లో గిరిజనులకు నూరుశాతం రిజర్వేషన్ కల్పించే ఈ జిఒ పునరుద్ధరణకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో గాలికొండ ఎంపిటిసి బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు బోనంగి చిన్నయ్యపడాల్, ధనుంజయ్, చిరంజీవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



అజయ్ను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

సైక్లింగ్లో సత్తా చాటిన అజయ్కు అభినందన

ప్రజాశక్తి -అనంతగిరి : గతనెలలో అరకులో నిర్వహించిన చలి ఉత్సవ్లో సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటి రెండోస్థానంలో నిలిచిన అరకులోయ మండలం, సుంకరమెట పంచాయతీ దండబాడు గ్రామానికి చెంది కుమ్మకోట గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి పెట్టెటి అజయ్ను జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్కుమార్ అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గతనెల 29. 30. 31. తేదీల్లో అరకులో నిర్వహించిన చలి ఉత్సవ్లో పర్యాటక కేంద్రం బొర్రా గుహలు నుంచి అరకులో 36 కిలోమీటర్లు సైక్లింగ్ పోటీల్లో అజయ్ రెండోస్థానంలో నిలిచాడు. ఈ పోటీల్లో ఉత్తరప్రదేశ్కు చెందిన గోపీ అగర్వాల్ విజేతగా నిలవగా, రెండోస్థానంలో దండబాడుకు చెందిన అజయ్, మూడోస్థానంలో విశాఖ నగరంలోని అగనంపూడికి చెందిన ప్రియదర్శిని మూడోస్థానంలో నిలిచారు.

సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటిన అజయ్ను పారిస్లో జరిగే అంతర్జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంపిక చేసి పంపనున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్కుమార్ వెల్లడించారు. అక్కడ 23రోజులపాటు మూడు వేల కిలోమీటర్ల సైక్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా అజయ్కు అధునాతనమైన సైకిల్ను బహూకరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని, అజయ్ను స్ఫూర్తిగా తీసుకుని గిరిజన విద్యార్థులు పురోగమించాలని జిల్లా కలెక్టర్ దినేష్కుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరకు టూరిజం మేనేజర్ మురళి, విద్యార్థి తల్లిదండ్రులు పెటెలి లైబన్, .గ్రామస్తుడు ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉక్కు ఆవిర్భావ దినోత్సవానికి మంగళం

- కార్మికులకు ఇచ్చే పురస్కారాలకు యాజమాన్యం ఎగనామం

- వైజాగ్ స్టీల్ప్లాంట్ చరిత్రలో ఇదే తొలిసారి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఏ సంస్థకైనా స్థాపించబడిన రోజు అత్యంత ప్రాముఖ్యమైనది. అందులో పనిచేసే ఉద్యోగులు, యాజమాన్యానికి నిజమైన పండగ రోజు. కానీ వైజాగ్ స్టీల్ప్లాంట్ చరిత్రలో మొదటిసారి ఆ రోజును ఉద్యోగులు, కార్మికులు మరిచిపోవాల్సిన పరిస్థితులను యాజమాన్యం కల్పించింది. డబ్బుల్లేంటూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మంగళం పాడేసింది. దీంతో కార్మికవర్గం నిరాశకు గురైంది.

ఎలాగైనా విశాఖ స్టీల్ప్లాంట్ను మట్టుపెట్టాలన్న పట్టుదలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు విషయంలో తీసుకున్న ప్రైవేటీకరణ వైఖరికి అద్దం పట్టేలా 'ఉక్కు' ఆవిర్భావ దినోత్సవానికి యాజమాన్యం ఎగనామం పెట్టినట్టు కనిపిస్తోంది. ఉక్కు కార్మికులకు రూ.11400 కోట్ల ప్యాకేజీ సాధించిన ఘనత తమదేనంటూ జబ్బలు చరచుకుంటున్న కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన, బిజెపి రాష్ట్ర నాయకులు స్టీల్ప్లాంట్ స్థాపించిన రోజును కూడా నిర్వహించలేని స్థితిలో ఎందుకు పడ్డారో వారే చెప్పాలి.

విశిష్టమైన రోజు.. 1982 ఫిబ్రవరి 18

1982 ఫిబ్రవరి 18న విశాఖ స్టీల్ప్లాంట్ ఏర్పాటైంది. దేశంలోనే ఏకైక తీర ఆధారిత స్టీల్ప్లాంట్ ఇదే. 2010లో ఉక్కుకు భారత ప్రభుత్వం 'నవరత్న' హోదా ఇచ్చింది. సెయిల్ నుంచి ఆర్ఐఎన్ఎల్గా మార్చబడిన నాటి నుంచీ 2024 సంవత్సరం వరకూ ఇదే రోజున అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నారు. 1970లో దేశ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రకటన చేస్తూ విశాఖపట్నంలో స్టీల్ప్లాంట్ను ప్రభుత్వం నిర్మించనుందని వెల్లడించారు. 1971 జనవరి 20న ప్లాంట్కు శంకుస్థాపన జరిగింది. 2024 ఫిబ్రవరి 18న 42వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంది. తాజాగా ఈ ఏడాది 2025లో మాత్రం యాజమాన్యం ససేమిరా అంటోంది. ఉక్కు ఉద్యోగ, కార్మికుల్లో బాగా సేవలందించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఆవిర్భావ దినోత్సవాన 'నెహ్రూ అవార్డులు' అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఫార్మేషన్ డేకు ఈ ఏడాది స్టీల్ యాజమాన్యం మంగళం పలికేయడంతో అవార్డుల కార్యక్రమం కూడా లేనట్టే లెక్క. డబ్బుల్లేవని, అందువల్లే ఆవిర్భావ దినోత్సవాన్ని జరపడం లేదని ప్లాంట్ యాజమాన్యం కుంటిసాకులు చెబుతోంది. 1466 రోజులుగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోడానికి ఓ వైపు పోరాటాన్ని సాగిస్తూనే మరోవైపు ఉత్పత్తి విషయంలో కార్మికులు వెనక్కి తగ్గకుండా శ్రమిస్తున్నారు. ఉత్పత్తి పెరుగుతున్నా సరే స్టీల్ కార్మికులకు ఐదు నెలలుగా పూర్తి స్థాయిలో జీతాలివ్వకుండా యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోంది. స్టీల్ప్లాంట్కు భూములు త్యాగం చేసిన నిర్వాసితులనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కన్నెత్తి చూస్తున్నాయా ? అంటే అదీ లేదు. ప్లాంట్లో ఉన్న వారిని ఎలా తగ్గించేసి ఉపాధిని దెబ్బకొట్టాలన్న కుట్రలకే యాజమాన్యం కాలం వెచ్చిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాకు చేరిన బ్యాలెట్ పత్రాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి ఈ నెల 27న జరుగనున్న ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు సోమవారం జిల్లాకు చేరుకున్నాయి. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలు, ఇతర వివరాలతో కూడిన నివేదికలను స్థానిక అధికారులు ఇప్పటికే పింపించారు. ఆ మేరకు సంబంధిత బ్యాలెట్ పత్రాలను కర్నూలులో ప్రింటింగ్ చేశారు. అక్కడి నుంచి వాటిని ప్రత్యేక వాహనంలో విశాఖపట్నం కలెక్టరేట్కు సోమవారం తీసుకొచ్చారు. పది శాతం రిజర్వ్తో కలిపి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యకు సరిపడా సంబంధిత పత్రాలను స్థానిక అధికారులు సేకరించి భద్రపరిచారు. ఎఆర్ఒ, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సంబంధిత వాహనానికి పోలీసులు, ఇతర లైజనింగ్ అధికారుల సమక్షంలో సీలు వేసి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించారు.

రాజుగారి పాకశాల అవుట్లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర వంటకాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలని సంకల్పించిన గెహనా కలినరీ ఆర్ట్స్ ఆధ్వర్యంలోని రాజుగారి పాకశాల తన మొదటి ప్రీమియం టేక్ అవే అవుట్లెట్ను నగరంలోని రామనగర్ చర్చి ఎదుట సోమవారం ప్రారంభించింది. ఈ ప్రాంగణ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, చెన్నుబోయిన వంశీ కృష్ణ శ్రీనివాస్, విఎంఆర్డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ రాజుగారి పాకశాలలో వండిన పలావ్ తినగానే ఆనాటి రుచులు గుర్తుకు వచ్చాయన్నారు. ఇలా సంప్రదాయ వంటకాలను అందించడం అభినందనీయమని అన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించండి

ప్రజాశక్తి - కూనవరం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని పలువురు పట్టభద్రుల ఓటర్లను సోమవారం కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత, వ్యర్థ హామీలను నమ్మకుండా నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే రాఘవులుకు ఓట్లు వేయాలని కోరారు. అధికార పక్షం తరుపున పోటీ చేసేవారు గెలిచాక ప్రభుత్వం ఏమి చెబితే అది చేయడం, తమ ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని ఉపయోగించుకోవడం తప్పా పట్టభద్రుల ఓటర్ల సమస్యలపై ఏనాడూ మాట్లాడిన దాఖలాల్లేవని పేర్కొన్నారు. కాని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరుద్యోగులు పక్షాన ఎల్లవేళలా ఉంటున్నారని గుర్తు చేశారు. అందుకే అవినీతి మచ్చ లేని పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, మండల కమిటీ సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సిఐటియు ప్రచారం

మారేడుమిల్లి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డివి.రాఘవలు గెలుపును కాంక్షిస్తూ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ ఆధ్వర్యాన మారేడుమిల్లి మండలంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లి పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ఉపాధ్యాయ, కార్మిక, పేద ప్రజల సమస్యలపై శాసన మండలిలో నిరంతరం పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని పేర్కొన్నారు. అలాంటి వారిని గెలిపించుకొని ప్రజా గొంతుకని శాసన మండలికి పంపించాలని కోరారు. పట్టభద్రుల ఓటు హక్కు కలిగాఇన ప్రతి ఒక్కరూ తమ మొదటి ప్రాధాన్యత ఓటుని డివి.రాఘవులుకు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పల్లాల విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో ప్రచారం చేపడుతున్న వాణిశ్రీ తదితరులు

రేణుకా మహంతి మృతిపై సందేహాలు

ఆమె చనిపోయింది జిబిఎస్తోనా ? గుండెపోటుతోనా ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్లో గులియన్ బారే సింద్రోమ్ (జిబిఎస్) వ్యాధితో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం మల్లివీడు గ్రామానికి చెందిన రేణుకా మహంతి (63) ఘటనపై పలు సందేహాలు, విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఆమె గుండె జబ్బుతో మరణించినట్లుగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రకటిస్తూ మీడియాకు సమాచారం ఇచ్చారు. జిబిఎస్తో ఆమె చనిపోలేదని ఆయన చెప్పుకొచ్చారు. అయితే ఆమె మృతి చెందడానికిగల కారణాలపై మాత్రం రకరకాల చర్చలు నడుస్తున్నాయి. ఈ నెల 6న కెజిహెచ్లో జిబిఎస్ సింద్రోమ్ వ్యాధితో రేణుకా మహంతి చేరారు. ఆమెను జనరల్ మెడిసిన్ విభాగంలో ఇన్ పేషెంట్గా ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ విభాగానికి చెందిన ప్రొఫెసర్ జివిఎస్.శ్రీనివాసరావు ఆమెకు వైద్య సేవలు అందివ్వడంతో పాటు, నిత్యం ఇక్కడి రోగుల ఆరోగ్య విషయాలుపై జాగ్రత్తలు తీసుకోవలసి ఉంది. అయితే ఆమె ఈ వార్డులో చేరినప్పటి నుంచి ఒక్కరోజు కూడా ఆయన ఆమెకు వైద్య సేవలు అందించనట్టు, కనీసం పేషెంట్ను కూడా ఆయన చూడనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ఈ విభాగంలో చికిత్సలు పొందుతున్న ఆరుగురు రోగులను మార్నింగ్ విజిట్ సమయంలో వచ్చి చూసి పరిశీలించారు. ఆ సమయంలో కూడా ప్రొఫెసర్ శ్రీనివాసరావు లేరని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే ప్రొఫెసర్ శ్రీనివాసరావు నిర్లక్ష్యం కూడా రేణుకా మహంతి మరణానికి కారణంగా పలువురు భావిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ మొత్తం సంఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లుగా తెలిసింది. దాని పర్యవసానం ఎలా ఉంటుందనేది తెలియాల్సి ఉంది.



రేణుకా మహంతి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న శివానంద (ఫైల్)



సాయం అందిస్తున్న జర్నలిస్టులు

వ్యాధిగ్రస్తురాలికి జర్నలిస్టుల సహాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని చికిలింత గ్రామంలో జర్రా నూకరత్నం అనే గిరిజన మహిళ కొంతకాలంగా అన్నవాహిక సమస్యతో బాధపడుతుండగా, ఆమె కుటుంబానికి జర్నలిస్టులు సోమవారం సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన నూకరత్నంకు ఎటువంటి ఆధారం లేదు. విషయం తెలుసుకున్న రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అరిపాక సూరిబాబు ఆర్థిక సహాయంతో కొంత ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు సోమవారం జర్నలిస్టులు అందజేశారు. ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించే వారు ఉంటే ముందుకు రావలసిందిగా గ్రామ సర్పంచ్ కొండ్ల సూరిబాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు దుర్గాప్రసాద్, రామరాజు, ఉదయభాను, ఈ శ్రీను, రవి, కె శ్రీను, సతీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ మృతికి సిపిఎం నేతల సంతాపం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ పరిధి సోములు గూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆసు కిరణ్ కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. కిరణ్ సిపిఎం సీనియర్ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారుడు ఆసు లక్ష్మయ్య కుమారుడు. కిరణ్కు భార్య, కుమారుడు ఉన్నారు. కిరణ్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సిపిఎం మండల నాయకులు గ్రామానికి వచ్చి కిరణ్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ చిన్న వయస్సులో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ కిడ్నీ వ్యాధితో మరణించడం చాలా బాధాకరమన్నారు. కిరణ్ మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కమ్మచిచ్చు సత్యనారాయణ, కారం సుందరయ్య, కుంజ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : జిల్లాలోని చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధి సూకుమామిడి కొండరెడ్ల గ్రామంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో గతంలో ఉన్న బోరు మరమ్మతులకు గురి కావడంతో మంచి నీటి సమస్య తీవ్రతరమైంది. తాగునీటి సమస్యను గ్రామస్తులు ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన తమ ట్రస్టు తరుపున కొత్త బోరు వేయించడం జరిగింది. తమ గ్రామానికి వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించిన జమాల్ ఖాన్కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమలో గ్రామస్తులు పళ్ళలా రమణ రెడ్డి, శివరామ కృష్ణారెడ్డి, ఆదిలక్ష్మి, జాన్సిరాణి, పళ్ళలా హరిణి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అచ్యుతరావుపై బదిలీ వేటు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఆర్థోపెడిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అంపోలు అచ్యుతరావుపై బదిలీ వేటు పడింది. విధులు సరిగా నిర్వహించకుండా, అక్రమాలకు పాల్పడే ప్రభుత్వ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే డాక్టర్ అచ్యుతరావు వ్యవహారంపైనా దర్యాప్తు సాగినట్టు తెలుస్తోంది. వికలాంగులకు ఇచ్చే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలకు పాల్పడినట్లు, ఆపరేషన్లు చేయడానికి డబ్బు తీసుకుంటున్నట్లు, సహకార సిబ్బంది, వైద్య విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర సీనియర్ల ఆదేశాలను ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆయనపై బదిలీ వేటు పడినట్టు వైద్యులు చెబుతున్నారు.